# సంపాదకీయము

యోగాచార్యులు, అవతారమూర్తి, మన గురుదేవులైన పూజ్య శ్రీ బాబూజీ మహారాజ్ వారికి తన శక్తులను ధారపోసిన శ్రీ కృష్ణపరమాత్మ జయంతి సందర్భములో మన గురుదేవులైన పూజ్యశ్రీ బాబాబూజీ మహారాజ్ వారి స్మరణలో గడుపు సదవకాశము మరల మనకు లభించినది.

ఈ భువిలో జన్మించిన మానవులు తమ జీవితమును ఆనందముగా గడపవలెనను కోరికగల వారై, ఆ ఆనందము ప్రాపంచికముగా భోగభాగ్యములతో కూడిన జీవితమును గడుపుటయే అను భావన కలిగి యుందురు. వారు అతి సుఖవంతమైన జీవితము మరియు సంఘములో పలుకుబడి, గౌరవమైన స్థితులకోసమే అహర్నిశలు తమ శక్తియుక్తులను, సమయమును వెచ్చించెదరు. వాటిని సమకూర్చుకొనుటయే పెద్ద సమస్యగా పరిగణించి దానినే లక్ష్యముగా నెంచుకొని, అది నెరవేరుటకు పాటుపడుచుందురు. మనమరియొక జీవితము, అది ఏదైనను, మరణము తరువాత మొదలగును. ఈ జీవితమునకు ముందువలె దీని తరువాత కూడ అనేక జన్మలు కలుగును. ఈ జనన మరణ చక్రము అనంతముగా కొనసాగుతునే యుండును. అందువలన ఈ ప్రస్తుత జీవితమొక్కటియే గాక దీని పిదప కలుగబోవు అనేక జీవితములు కూడ సమస్యయే కావున దీనికి
పరిష్కారమును కనుగొనవలసిన అవసరము కలదు. ఇంకా వివరముగా యోచించిన మహా ప్రళయము వరకు ఆత్మకు కలుగబోవు స్థూల, సూక్ష్మరూపములకు తగిన పరిష్కారము కనుగొనవలసి యున్నది.

ఈ సందర్భములో పూజ్యులైన శ్రీ కె.సి.నారాయణ గారు తమ సెమినార్ పేపర్‌లోని ఒక కథను మీతో పంచుకొనెదను. ఒక వ్యక్తికి నలుగురు భార్యలుండిరి. అతనికి వ్యాధి ముదిరి అవసానదశ సమీపించి చనిపోవుటకు సిద్ధముగా నుండెను. ఆ దశలో ఒంటరితనముతో బాధపడుచున్న అతడు తను అమితముగా ప్రేమించిన మొదటి భార్యను తనకు తోడుగా రమ్మని కోరెను. కానీ ఆమె తనను బాగుగా చూచుకొనుట వాస్తవమైనను విడిపోవు సమయము ఆసన్నమైనది కావున ఆతనిని విడిచిపోయెదనని సమాధానమిచ్చెను. అపుడు తన రెండవ భార్యను మృత్యువులో తనకు తోడుగా రమ్మనమని కోరెను. మీ మొదటి భార్య నిరాకరించినది కావున నన్ను అడుగుచున్నావు. ఇంతవరకు నన్ను నీ స్వార్థము కోసమే నన్ను ప్రేమించినావు కావున నేను రానని చెప్పినది. తన మూడవ భార్యను పిలిచి తనకు తోడుగా రమ్మని అడిగెను. ఆతని పరిస్థితికి చాలా చింతించుచున్నాననియు, శ్మశానము వరకు అతనితో వచ్చుటకు అంగీకరించెను. అపుడు తన జీవితములో బానిసవలె చిన్నచూపు చూచి, ఎప్పుడూ పట్టించుకొనని తన నాలుగవ భార్య అతని స్మృతిపథమునకు వచ్చెను. ఆమెను అడిగినను తప్పక నిరాకరించునని భావించినను, ఆతని ఒంటరితనము మరియు భయము ఆమెను తనకు తోడుగా రమ్మనమని అర్థించునటుల చేసెను. కానీ ఆమె సంతోషముతో, ఏమి జరిగినను తను అతనితో నుండుటకే నిశ్చయించుకొనినానని మరియు తనను అతనినుండి వేరుచేయలేరని చెప్పెను. ఇది

వేదాంతపరమైన కథ. దీనిలో మొదటి భార్య మన శరీరము. మన శరీరముపై ఎల్లవేళలా మమకారము కలిగియుండి దానికి తగిన దానికంటె ఎక్కువగా ప్రాముఖ్యమిచ్చెదము. కానీ మరణించిన పిదప ఈ శరీరముతో మరియొక ప్రపంచములోనికి పోలేము. రెండవ భార్య ప్రాపంచిక సంపాదనలు, ఆస్తులు, కీర్తి ప్రతిష్ఠలు, సమాజములో మనము పొందిన స్థితులు, ఉద్యోగము మొదలైనవి. జీవితాంతమూ వీటికే అంటిపెట్టుకొని వీటిని వదులుకొనుటకు భయపడెదము. వీటికి అంతము లేదు. ఇవి మరణములో తోడురావు. మూడవ భార్య మన బంధుత్వములు, స్నేహితులు, సమాజమును సూచించును. వీరందరూ కడు చింతించుచూ శ్మశానమువరకు అనుసరించెదరు. ఈ విధముగా మన శరీరము, ప్రాపంచిక సంపాదనలు, బంధుమిత్రులపై ఆధారపడలేము. ఇక నాల్గవ భార్య మన మనస్సు. మన మనస్సును నిశితముగా పరిశీలించిన అది క్రోధము, మోహము మరియు అసంతృప్తులతో నిండినటుల గుర్తించి మన జీవితముపై వాస్తవమైన అవగహన కలుగును. ఇవి యన్నియు మన కర్మలు కావున అవి మన నుండి వేరుపడలేవు.

ఈ కథవలన మనము నేర్చుకొనవలసినదేమనగా మన శక్తిని కలుషితమైన మనస్సుపై కేంద్రీకరించి దానిని సరియైన మార్గములో పెట్టుటకు బదులు శరీరము, ప్రాపంచిక సంపదలు, బంధుమిత్రులపై కేంద్రీకరించి నిరుపయోగ పరచెదము. ఈ విధముగా పట్టించుకొనని మనస్సు కలుపు తీయని తోటవంటిది. ప్రాపంచిక జీవితముపైనే దృష్టిని కేంద్రీకరించినపుడు జీవితము ఒక పెద్ద పోరాటముగా అనిపించును. ఎప్పుడైతే ఆధ్యాత్మిక జీవనముపై దృష్టి సారించెదమో మన జీవితములలో గొప్ప మార్పు సంభవించును.

మన మనస్సును పరిశుద్ధపరచి సరియైన మార్గములో పెట్టుటకు పూజ్య బాబూజీ మహారాజ్ గారు అపార కృపతో మనకు అందించిన ప్రాణాహుతి సహిత ధ్యానములోని ధ్యాన సాధనలతో పాటుగా ప్రాణాహుతి ద్వారా గురుదేవుల సహాయము నిరంతరము మన సాధనలో తోడై వాస్తవమైన జీవిత సమస్యకు పరిష్కారము చూపి ఉన్నత స్థితులకు కొనిపోవును. సాధకులందరికీ గురుదేవుల కృప నిరంతరము లభించవలెనని ప్రార్థించుచున్నాను.

సంపాదకులు